క్లుప్తంగా

నానిరాజుకు అనురాధ పరామర్శ



నానిరాజుతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ అనురాధ

అల్లవరం: ఇటీవల మోకాలుకి శస్త్ర చికిత్స చేయించుకుని అమలాపురంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజును మాజీ ఎంపీ చింతా అనురాధ సోమవారం పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆమె వెంట సర్పంచ్ రాయుడు విష్ణు, ఎంపీటీసీ సభ్యురాలు పులుసుగంటి రాజేశ్వరి, అనిల్ తదితరులున్నారు.

ఘనంగా మహా సౌర యాగం



కేశనకుర్రుపాలెంలో సౌర యాగం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రుపాలెంలో రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో రుద్ర, శత చండీ, మహా సౌరయాగాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలో గణపతి పూజ, గవ్యాంతం, మహాన్యాసం, రుద్రాభిషేకం, శత సహస్ర బిల్వార్చన, సూర్యనమస్కారాలు, చండీ పారాయణ, చండీ హోమం, రుద్ర హోమం జరిపారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేదాగమ పండితులు కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ, కాళ్లకూరి కామేశ్వర శర్మ, వెలవల్లి చంద్రశేఖర్ శర్మల ఆధ్వర్యంలో 12 రోజుల పాటు యాగం నిర్వహించనున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ముమ్మిడివరం త్రిముఖ గణపతి స్వామి

ముమ్మిడివరం: స్థానిక బల్లగేటు సెంటర్‌లో త్రిముఖ గణపతి ఆలయ 19వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం భక్తుల కోసం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

రామాలయానికి స్టీలు గ్రిల్స్ సమర్పణ



రామాలయానికి దాత సమకూర్చిన స్టీలు గ్రిల్స్

తాళ్లరేవు: స్థానిక గాంధీనగర్‌లో నూతనంగా నిర్మించిన సీతారామాలయానికి ఒక దాత స్టీలు గ్రిల్స్ సమర్పించారు. మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీలో ఉన్న రవి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పెద్దిరెడ్డి రవికుమార్ సుమారు రూ.70 వేలు విలువ చేసే స్టీలు గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, గణేష్ యూత్ సభ్యులు రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైభవంగా దత్త మణికంఠ మందిర వార్షికోత్సవం



దత్త మణికంఠ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

యానాం: స్థానిక దత్త మణికంఠ పూజా మందిరం ఆరో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, గణపతి హోమం, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. యానాం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దాత పెద్దిరెడ్డి సతీష్ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మల్లాడి సత్తిబాబు, గురుస్వాములు ఆకుల నాగేశ్వరరావు, చెక్కా నూకరాజు, బర్రే మల్లేశ్వరావు, మార్కండేయులు, కంచర్ల పెదబాబు, అర్జునరావు, వాసిరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లి జన్మనిస్తే పునర్జన్మనిచ్చేది వైద్యులే

యానాం: తల్లి జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని, వారి సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమైనవని ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ పేర్కొన్నారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నతమైన వృత్తి వైద్య వృత్తి అని, వైద్యుడికి దేవునితో సమాన హోదా ఇస్తారన్నారు. కరోనా మహమ్మారి లాంటి ఆరోగ్య విపత్తు సమయంలో వైద్యులు రోగుల ప్రాణాల కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారన్నారు. వైద్యుల అంకిభావం, నిస్వార్థ సేవలను గౌరవించాన్నారు. కార్యక్రమంలో ఏడీ సన్యాల్, వైద్యులు కాశీ సత్యనారాయణ, పృథ్వీ, దీపిక, నవీన్, యామిని, మనీష్, నర్మదా, దివ్య, మాధురి, వరప్రసాద్, విజయ్, లక్ష్మణ్, వెంకటేష్ పాల్గొన్నారు. యానాం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను పురస్కరించుకుని డాక్టర్ కాకర్లపూడి వీరేశ్వరశర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యుడు ఉయ్యూరు చరణ్, నిరంజన్, నరసింహమూర్తి, సురేష్, గోపి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



యానాం జీజీహెచ్‌లో వైద్యుల దినోత్సవంలో పాల్గొన్న వైద్యులు



ఐ.పోలవరంలో వైద్యులు, విద్యార్థులను సత్కరిస్తున్న ప్రజ్ఞా సాహితీ సంస్థ ప్రతినిధులు



తాళ్లరేవులో సూపరింటెండెంట్ శిరీషను సత్కరించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు



డాక్టర్ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న ఎస్‌బీఐ బ్రాంచి చీఫ్ మేనేజర్ రమేష్

వైద్యులకు ఘన సత్కారం

తాళ్లరేవు: డాక్టర్స్ డేను పురస్కరించుకుని తాళ్లరేవు, గొల్లపాలెం లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం పలువురు వైద్యులను ఘనంగా సత్కరించారు. స్థానిక సామాజిక ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ పి.శిరీష, వైద్యులు స్నేహలత, సిరిల్, అజయ్‌లను క్లబ్ ప్రతినిధులు దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం తాళ్లరేవు, పి.మల్లవరం పరిసర ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులు కామిశెట్టి పల్లంరాజు, పబ్బినీడి విజయ్, కూర్మదాసు మణికృష్ణ, ఐతంపూడి నరసింహరావు, పితాని నాగరాజు, పి.రవీంద్ర, వీఆర్ఎస్‌బీ ప్రసాద్, ఖండవిల్లి రాంబాబు, ఖండవిల్లి ఆచారిలను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, పొన్నాడ పేరయ్యరాజు, వేలూరి సూరిబాబు, నున్న దత్తు, కట్టా ఆదినారాయణ, రాయపరాజు, కట్టా అప్పారావు, బూరిబాబు, చలపతి, చిరంజీవి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగం మరింత విస్తరించాలి

ఐ.పోలవరం: ఆపద సమయంలో ప్రజలకు ప్రాణాలు పోసే వైద్య రంగం మరింత విస్తరించాలని ప్రజ్ఞా సాహితీ సంస్థ ప్రతినిధులు అన్నారు. సోమవారం డాక్టర్స్ డేను పురస్కరించుకుని ఐ.పోలవరం వీఎస్ఎస్ఎన్ఆర్ కాలేజీ ఆవరణలో వైద్యులు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు డాక్టర్ బీసీ రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టి.కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యుడు విజయ్ మనోజ్‌కు డాక్టర్ బీసీ రాయ్ అవార్డును ప్రదానం చేశారు. డాక్టర్ ఆకొండి సీతారామశాస్త్రిని ఘనంగా సత్కరించారు. వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్, ఆర్.శ్రీనివాస్, జి.వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో డాక్టర్ దినోత్సవం, ఎస్‌బీఐ దినోత్సవాన్ని బ్యాంక్ అధికారులు సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ బి.రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అటు డాక్టర్లను, ఇటు బ్యాంక్ అధికారులను సత్కరించి అభినందించారు. వైద్యులు దేవుళ్లతో సమానమని, సమాజంలో వారి పాత్ర ఎంతో కీలకమని బ్యాంక్ అధికారులు కొనియాడారు. పట్టణానికి చెందిన చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ జి.ప్రభాకర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ నరసింహరాజుతో పాటు బ్యాంకు అధికారులను సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కృష్ణ ప్రసంగించి డాక్టర్లు, బ్యాంక్ అధికారుల సేవలను కొనియాడారు.

విశ్రాంత డిప్యూటీ సివిల్ సర్జన్‌కు సత్కారం

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేసిన విశ్రాంత డాక్టర్ అయ్యగారి సోమయాజుల నాగేశ్వరశాస్త్రిని వైద్యుల దినోత్సవం సందర్భంగా స్థానిక భూపయ్య అగ్రహారంలోని అమ్మమ్మ యోగా శిక్షణా కేంద్రంలో సత్కరించారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షురాలు దువ్వూరి సుబ్బలక్ష్మి, సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, విశ్రాంత బ్యాంక్ అధికారి పేరి లక్ష్మీనరసింహం, మహిళా వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

అమలాపురం రూరల్: అమలాపురం ఎంపీడీఓగా గుబ్బల మల్లిఖార్జునరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకూ ఎంపీడీఓగా పనిచేసిన జొన్నాడ వెంకటేశ్వరరావు పదవీ విరమణ పొందడంతో ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న మల్లిఖార్జునరావుకు ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

అక్రమ నిర్మాణం ఆపాలంటూ ధర్నా

అమలాపురం రూరల్: మండలంలోని జనుపల్లి పెద్ద వీధిలోని గాంధీ సెంటర్‌లో 79 ఏళ్ల క్రితం నాటి మహాత్మాగాంధీ విగ్రహం పక్కనే చేపట్టిన అక్రమ నిర్మాణం ఆపాలంటూ కలెక్టరేట్ వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు తటవర్తి మల్లికార్జునరావు, టి.సత్యనారాయణమూర్తి తదితరులు సోమవారం ధర్నా చేశారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఫిర్యాదు చేశారు.

సెంటాక్ తుది మెరిట్ జాబితా విడుదల

యానాం: 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆర్ట్స్, సైన్స్, కామర్స్ యూజీ నాన్ నీట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తుది మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు సెంటాక్ కన్వీనర్ అమన్‌శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఇప్పటికే గత నెల 21న డ్రాఫ్ట్ మెరిట్ జాబితా విడుదల చేశామన్నారు. అగ్రికల్చర్, బీఫార్మసీ, బీపీటీ, బీఎస్సీ పారా మెడికల్ కోర్సులు, బీటెక్, బీఏఎల్ఎల్‌బీ తదితర కోర్సులు ఉన్నాయన్నారు. స్పోర్ట్స్, పీడబ్ల్యూడీ కోటా సీట్లు సైతం మెరిట్ జాబితాలో ఉన్నాయని, వివరాలకు సెంటాక్ పుదుచ్చేరి వెబ్‌సైట్ చూడాలని కోరారు.

తిప్పి తిప్పి ఏడి‘పింఛన్’

- పింఛన్ కోసం అధికారుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- ఇంటికి వెళ్లి ఇవ్వకుండా ఒక చోటకు రమ్మని అక్కడే పంపిణీ

కాట్రేనికోన: ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇంటి ముంగిటకే పింఛన్లు అందజేస్తామన్న ప్రభుత్వ ప్రగల్భాలు కాగితాలకే పరిమితమయ్యాయి. వలంటీర్ల స్థానంలో సచివాలయ అధికారులకు పింఛన్ల పంపిణీ బాధ్యత అప్పగించడంతో లబ్ధిదారులు వారి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది. కొన్నిచోట్లయితే అధికారులు లబ్ధిదారులందరినీ ఒకచోటకు రమ్మని అక్కడే పింఛన్లు అందజేశారు. కాట్రేనికోన మండలంలోని తీర ప్రాంత గ్రామాలతో పాటు పలు చోట్ల పింఛను సొమ్ము కోసం లబ్ధిదారులంతా సంబంధిత అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. పింఛన్ సొమ్మును లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందించాలనే ఆదేశాలున్నా కాట్రేనికోన, కొత్తపాలెంల్లో సంబంధిత అధికారులు మాత్రం లబ్ధిదారులందరినీ ఒక చోటకు పిలిపించుకుని పింఛన్లు అందచేశారు. తీర ప్రాంతాల్లో పింఛను సొమ్ము పంపిణీ కోసం అధికారులు రమ్మన్న చోటుకు పింఛన్‌దారులంతా గుంపులుగా వెళ్లడంతో గందరగోళం ఏర్పడింది. గత ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారకుండానే వలంటీర్లు ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్ సొమ్ము అందించేవారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

అల్లవరం: మండలంలోని డి.రావులపాలెం, దేవగుప్తం, ఎంట్రుకోన, కోడూరుపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు లబ్ధిదారులకు పింఛన్ అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, నడింపల్లి సుబ్రహ్మణ్యం, తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ముత్తాబత్తుల రాంబాబు, తిక్కా శేషుబాబు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: సామాజిక పింఛన్లను పెంచుతామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో సామాజిక పింఛన్ల కార్యక్రమాన్ని ఆయన సోమవారం ఉదయం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్, కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ పెచ్చెట్టి విజయలక్ష్మి పాల్గొన్నారు.



కొత్తపాలెంలో లబ్ధిదారులందరినీ ఒక చోటకు రప్పించి పింఛన్ అందిస్తున్న సచివాలయ సిబ్బంది



కాట్రేనికోనలో అధికారుల ఆదేశాలతో పింఛన్ కోసం ఒక చోటుకు చేరుకున్న లబ్ధిదారులు



అమలాపురంలో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



భీమనపల్లిలో లబ్ధిదారుడికి పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



ఉప్పూడిలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

అమలాపురం టౌన్: సామాజిక భద్రత పింఛన్ పథకం పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక 29వ వార్డు విద్యుత్‌నగర్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ఉదయం ప్రారంభించారు. కలెక్టర్ శుక్లా స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లు గీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, డప్పు కళాకారులు, హిజ్రాలు వంటి 11 రకాల లబ్ధిదారులకు రూ.4 వేల వంతున పింఛన్ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, 29వ వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ పాల్గొన్నారు.

94 శాతం మేర పంపిణీ

తాళ్లరేవు: తొలిరోజు మండలంలో 94 శాతం మేర పింఛన్లు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చింతా మోహన్‌కృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన తాళ్లరేవు జిల్లావారిపేటలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి నున్న శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: మండలంలోని కందికుప్ప, ఉప్పూడి గ్రామాల్లో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. గచ్చకాయలపోర, కాట్రేనికోనల్లో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావులు లబ్ధిదారులకు పింఛను అందచేశారు.

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి, గొల్లవిల్లి, కూనవరం, చల్లపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. గోపవరం, చల్లపల్లి గ్రామాల్లో జేసీ నుపూర్ అజయ్, ఉప్పలగుప్తంలో ఆర్డీవో కేశవ వర్ధన్ రెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్, తహసీల్దార్ టి.మల్లికార్జునరావు, సర్పంచ్‌లు పెయ్యల రాజ్‌కుమార్, జొన్నాడ శ్రీదుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు నాగులపల్లి శేషవేణి పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక..



ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్న 1978-79 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

యానాం: స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1978–79 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. జీవితంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సుమారు 46 ఏళ్ల తరువాత స్థానిక ప్రభుత్వ సీగల్స్ హోటల్‌లో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ చేసిన సూపరింటెండెంట్ ఎ.సత్యనారాయణ, హెచ్‌ఎం దంగేటి త్రిమూర్తులు, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఉద్యోగి గోకవరపు వీరేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. యానాం పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న పేద విద్యార్థిని సూరిశెట్టి అమృత వర్షిణికి ఫీజుల నిమిత్తం రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ సీఐఎస్ఎఫ్ ఎస్పీ తొత్తరమూడి వెంకటేశ్వరరావు, రిటైర్డ్ సీఐ గూటం శివగణేష్, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పాలిమారి సత్యనారాయణ, అడ్వకేట్‌లు కమిడి విజయకుమార్, కముజు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను విజయవంతం చేయాలి



చొప్పెల్ల పీహెచ్‌సీలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పి డెంగీ వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున, డి.సాయికిషోర్ కోరారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా పీహెచ్‌సీలతో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో సోమవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈనెల ఒకటి నుంచి 31 వరకూ నిర్వహించే డెంగీ వ్యాధి వ్యతిరేక మాసోత్సవాల ఆవశ్యకతను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు.

బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు తెర

యానాం: కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి రావడంతో బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు తెరపడిందని పలువురు వక్తలన్నారు. సోమవారం యానాం పోలీస్‌స్టేషన్‌లో భారత న్యాయవ్యవస్థలో కొత్తగా చేరిన మూడు చట్టాల గురించి ఆయన అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలాది దుర్గా శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షితా సంహిత, భారతీయ సాక్ష్యాఅధినియం అమలులోకి వచ్చాయన్నారు. ఎస్పీ రాజశేఖరన్ సమగ్ర క్రిమినల్ ప్రొసీడింగ్స్, ఎఫ్ఐఆర్ నమోదులో సమయపాలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు మురుగానందన్, శేరు నూకరాజు, జిల్లెళ్ల ప్రభాకరరావు, రిటైర్డ్ సీఐ గూటం శివగణేష్, ఉపాధ్యాయుడు హంసాని రామలక్ష్మణుడు, గుత్తుల రామారావు తదితరులు పాల్గొన్నారు.



నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రాజశేఖరన్

అతిసార వ్యాధిని నివారించాలి



భీమనపల్లి పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

ఉప్పలగుప్తం: ప్రస్తుతం ఎక్కడికక్కడ విజృంభిస్తున్న అతిసార వ్యాధిని నివారించాలని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. మండలంలోని భీమనపల్లి, ఉప్పలగుప్తం పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు కె.విష్ణుప్రియ, ఎల్.నాగార్జునల ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశాలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు వయసున్న పిల్లల్లో వచ్చే అతిసార వ్యాధులను ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు గుర్తించి మరణాల రేటు తగ్గించాలని సూచించారు. అనంతరం పిల్లల తల్లులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పి.రాజ్‌కుమార్, కడిమి చిన్నవరాజు, ఎంపీటీసీ సభ్యులు దేశంశెట్టి నాగ రత్నకుమారి, తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, రవణం మధు, చిక్కం కాసు, చిక్కం వెంకట కృష్ణ, గాలిదేవర సురేష్, సీహెచ్‌వో విజయలక్ష్మి, ఎంపీహెచ్ఈవో ఆర్.రామకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

ఆలమూరు: పెదపళ్లలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు జరిగింది. రాయవరం మండలంలోని లొల్లకు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ అల్లూరి శ్రీనివాస చౌదరి చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. వైద్యాధికారి కె.సత్యభవాని, ఫార్మాసిస్టు జి.సుబ్బలక్ష్మి విచ్చేసి సుమారు 120 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి నెలా మొదటి సోమవారం హోమియో క్యాంపును పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నామని ట్రస్టు తెలిపింది.

94 మందికి వైద్య సేవలు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి పీహెచ్‌సీ పరిధిలో అయినవిల్లిలంక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం రోగులకు 104 సేవలు అందించారు. ఎంఎల్‌హెచ్‌ఎం జిల్లెల్ల మిలి ఆధ్వర్యంలో 94 మందికి వైద్య సేవలందించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగుల్లో ఎక్కువ మంది బీపీ, షుగర్, జనరల్ వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించామని వైద్యులు తెలిపారు. వారికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సత్కారం

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడం కళాశాలకు ఎంతో గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు అన్నారు. కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ (సీయూకే)లో ఎంఎస్సీ కెమిస్ట్రీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో గనిశెట్టి రామకృష్ణమోహన్‌శంకర్ 6వ ర్యాంకు, కొల్లాటి జాయిసి 7వ ర్యాంకు సాధించారు. అక్కడ చేరేందుకు వెళుతున్న సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో పుష్పగుచ్ఛాలు, మెమెంటోలతో అభినందించారు.